## క్లుప్తంగా

### నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన చినమూరి సదాశివరెడ్డి రూ.50,000 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో పై మొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథికి ఇచ్చి, స్వామి చిత్రపటం, లడ్డు ప్రసాదం దాత అందుకున్నారు.

**అయినవిల్లిలో మరో రూ.50 వేలు**

**అయినవిల్లి:** అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చినమూరి సదా శివరెడ్డి కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకుని రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, ఆలయ పాలక వర్గ సభ్యులు అభినందించారు.

### ఎన్నికల కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు

**అంబాజీపేట:** ఎన్నికలు నిర్వహించే పోలింగ్ బూత్‌ల సమీపంలో నిర్వహించే వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.గౌతమి, ఎ.ఇంద్రావతి శనివారం తెలిపారు. మండలంలో అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల పరిధిలోని వైద్య సిబ్బంది 54 పోలింగ్ బూత్‌ల వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల రోగాలకు మందులను అందుబాటులో ఉంచామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్‌ఎంలు, ఆశాలను శిబిరాల వద్ద నియమించామన్నారు.

### వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అయినవిల్లి:** అయినవిల్లి మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు.

### శనైశ్చరునికి తైలాభిషేకాలు

**కొత్తపేట:** శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ కె.విజయలక్ష్మి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,40,055, అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.47,771 ఆదాయంతో మొత్తం రూ.1,87,826 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

### ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



ఆనందరావుకు సాయం చేస్తున్న డేవిడ్

**సఖినేటిపల్లి:** అంతర్వేది దేవస్థానం గ్రామంలో శనివారం రోడ్డు ప్రమాద బాధితుడు, ఆదర్శ యూత్ మెంబర్ కొల్లాబత్తుల ఆనందరావుకు చికిత్స నిమిత్తం సదరు ఎన్నారై యూత్ సభ్యులు కలిసి రూ.55,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లి డేవిడ్ చేతుల మీదుగా ఆనందరావుకు ఇచ్చారు. స్థానికులు బత్తుల బాలాజీ కుమార్, యడ్ల రత్నబాబు ద్వారా సమాచారం అందుకున్న ఎన్నారై యూత్ సభ్యులు, ఈ మేరకు వారి ద్వారానే ఈ మొత్తాన్ని విదేశాల నుంచి ఇక్కడకు పంపారు. యూత్ ప్రెసిడెంట్ కొల్లాబత్తుల రఫీక్ పాల్గొన్నారు.

### సారా విక్రేత అరెస్ట్

**ఆలమూరు:** నిబంధనలకు విరుద్ధంగా సారా రవాణా చేస్తున్న వల్లూరి సతీష్‌ను ఆలమూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పిడింగొయ్యికి చెందిన సతీష్ తన బైక్‌పై 110 లీటర్ల సారాను తరలిస్తున్నాడు, విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై నేతృత్వంలోని పోలీసుల బృందం పహారా నిర్వహించి నిందితుడ్ని ఏటిగట్టు మీద వలపన్ని పట్టుకున్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసిన ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

# ముగిసిన ప్రచార పర్వం



నరేంద్రపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి



గొల్లపాలెం ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న రాజోలు అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

- మూగబోయిన మైకుల హోరు
- అభ్యర్థులకు మద్దతుగా శ్రేణుల ర్యాలీలు
- తమను ఆశీర్వదించాలని అభ్యర్థన

**మలికిపురం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ పార్టీ పేదల పార్టీ అని రాజోలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని దిండి, గొల్లపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కులాలకు సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌ను చంద్రబాబు అడ్డుకునేందుకు కుట్రల్లో భాగంగానే ఈ పొత్తులని అన్నారు.

**జగన్‌ను గెలిపిస్తేనే సంక్షేమ పథకాల అమలు**

**మామిడికుదురు:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పేర్కొన్నారు. ప్రచారంలో చివరి రోజు శనివారం పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నంలంక గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. ఉపాధి హామీ కూలీలతో పాటు పలు ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు.



పాశర్లపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

**ఇంటింటా వైఎస్సార్ సీపీ ప్రచారాలు**

**సఖినేటిపల్లి:** వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ జగన్ కోసం సిద్ధం కార్యక్రమంలో బూత్ స్థాయి కమిటీలు, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు ఫ్యాన్ గుర్తుపై చెరో ఓటు వేసి గెలిపించాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని అంటూ ఇంటింటా ప్రచారం చేశారు. అంతర్వేదిపాలెం నెహ్రూ కాలనీలో నమూనా బ్యాలెట్‌తో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఎన్నికల ప్రచారం చేశారు. వీటితో పాటు వీవీమెరకలో ఈవీఎం, బ్యాలెట్ నమూనాలతో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, నాయకులు దేవ రాజు, జె.కాంతారావు, మేడిది రెడ్డి, ఓగూరి బాబులు ప్రచారం చేశారు.

**అంబాజీపేటలో..**

**అంబాజీపేట:** సార్వత్రిక ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ప్రచారాలు చివరి అంకానికి చేరుకోవడంతో శనివారం సాయంత్రం 6 గంటలతో ముగిశాయి. ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. సుమారు 45 రోజుల పాటు సాగిన ప్రచారంలో అభ్యర్థులు తమ ప్రచారాలను హోరెత్తించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు ఎవరిస్థాయిలో వారు ప్రచారాలను హోరెత్తించారు.

**మరోసారి జగన్‌మోహన్‌రెడ్డే సీఎం**

**అయినవిల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి సీఎం అవుతారని వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. చింతనలంకలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఫ్యాన్ గాలి వీస్తుందని కూటమికి ఓటమి తప్పదని ఖాదర్ అన్నారు.

**ముగిసిన విప్పర్తి ఎన్నికల ప్రచారం**

**పి.గన్నవరం:** సంక్షేమ పథకాల అమలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాల రావు అన్నారు. విప్పర్తి ఎన్నికల ప్రచారం మండలంలోని నరేంద్రపురంలో శనివారం ముగిసింది. చివరి రోజున ఆయన ఓటర్లను కలుసుకుని ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తనను, ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లు సంక్షేమ పథకాలు అమలు కాకుండా అడ్డుకుంటున్నారని వివరించారు. పలు చోట్ల విప్పర్తికి మహిళలు హారతులిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం**

**సఖినేటిపల్లి:** త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఆ పార్టీ రాజోలు మాజీ కో ఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు అన్నారు. శనివారం గుడిమూలలో గ్రామ శాఖ అధ్యక్షుడు కోన ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

## సంక్షేమ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం

**కొత్తపేట:** పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ఆర్థికంగా ఆదుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మన ఓటు ద్వారా కాపాడుకోవాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆయా వర్గాలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శనివారం కొత్తపేట పంచాయతీ పరిధిలోని పలు మాదిగపేటల్లో పర్యటించి ఓట్లు అభ్యర్థించారు.

**గడపగడపకూ వైఎస్సార్ సీపీ ప్రచారం**

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజల వద్దకే సుపరిపాలనను తీసుకువచ్చేందుకు, సంక్షేమ పథకాల కొనసాగించడానికి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



సఖినేటిపల్లి మెయిన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ దీవెన కుమారి



అంతర్వేదిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నల్లి మోహన్



చింతనలంక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అబ్దుల్ ఖాదర్



గుడిమూలలో ఎన్నికల ప్రచారంలో బొంతు రాజేశ్వరరావు

# ప్రజానీకానికి రుణపడి ఉంటా..



వాడపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి జగ్గిరెడ్డి

**కొత్తపేట:** నియోజకవర్గంలో కుల, మత, పార్టీ రహితంగా అందరూ తమ కుటుంబ సభ్యుడిగా, అందరివాడిగా ఆదరిస్తున్న నియోజకవర్గ ప్రజానీకానికి జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఉరం చంటిబాబు, పల్లి ఆశీర్వాదం, పడమటి శ్రీను, ఉరం నరేష్, యడ్ల ఆనంద్‌కుమార్, నామాడి కిరణ్‌కుమార్ తదితరులు, కొత్తపేట గ్రామానికి చెందిన సానబోయిన రాంబాబు (సమరయ్య), మద్దులమెరక గ్రామానికి చెందిన చిట్టూరి మంగన్న, పెద గూళ్లపాలెంకు చెందిన మామిడిశెట్టి శివకుమార్ ఆ పార్టీకి రాజీనామా చేసి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. అందరూ మళ్లీ ఆయన ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, నియోజకవర్గంలో ప్రజాసేవకు అంకితమైన నాయకుడు జగ్గిరెడ్డి అని నమ్ముతున్నామన్నారు. అందుకే వైఎస్సార్ సీపీని బలపరుస్తున్నామన్నారు. దానికి ప్రతిగా జగ్గిరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో, మీలో ఒకడిగా ఉంటానని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


## వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

**పి.గన్నవరం:** ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. నరేంద్రపురం శివారు పోలంపేటకు చెందిన 50 మంది కార్యకర్తలు శనివారం పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో విప్పర్తి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన గోసంగి రవి, రాము, నాని, తరపట్ల రమణ, సురేష్, వెంకటేష్, నేలపూడి రవీంద్ర, బాబు, ముత్తాబత్తుల నాని, మణికుమార్ తదితరులకు విప్పర్తి వైఎస్సార్ సీపీ కండువాలు వేశారు. పార్టీ శ్రేణులు జగన్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, జల్లి శ్రీను, ఎ.వెంకట సాయిరామ్, కె.రవికుమార్, ఎస్.సత్యనారాయణ, ఆర్.చిన్న, పి.రాజు, సీహెచ్ నందియ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వరమాలతో జగనన్నకు తోడుగా...



బొంతు శ్రీనివాస్

**రాజోలు:** స్వయంగా పాటలు రాసి తానే ఆలపించి తన స్వరమాలతో జగనన్నకు తోడుగా నిలుస్తున్నాడు సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీకి చెందిన బొంతు శ్రీనివాస్. ఓదార్పు యాత్ర నుంచి ఇటీవల నిర్వహించిన సిద్ధం సభల వరకు శ్రీనివాస్ పాటలు ఆయా సభలు, యాత్రల్లో ప్రజలకు వినిపిస్తుంటాయి. ఓదార్పు యాత్ర, హరిత యాత్ర, ప్రజా సంకల్పయాత్ర, సిద్ధం సభలకు శ్రీనివాస్ పలు పాటలను రాసి ఆలపించాడు. వాటిలో పలు పాటలను 'సాక్షి' టెలివిజన్‌లో ప్రచారం చేశారు. సిద్ధం సభలకు శ్రీనివాస్ రాసిన పాటలను జగనన్న కనెక్ట్స్ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ పాటలను సజ్జల భార్గవ్‌రెడ్డి రిలీజ్ చేశారు. సిద్ధమై కదిలాడు... సింహంలా.. పాటను సోషల్ మీడియాలో వేలాది మంది వీక్షించి ప్రశంసించారు. పేద ప్రజల గుండెల్లో సీఎం జగన్ గుడి కట్టి పూజించే దేవుడయ్యాడు అంటూ రాసిన సిద్ధం పాట ఎంతగానో హత్తుకుంది. రైతన్నా.. రామరాజ్యాన్ని తెచ్చేది జగనన్నా... ఏ లోకాన రాజన్న ఉన్నా మా ముందుకొచ్చావు జగనన్నా.. అంటూ రైతుల పక్షాన రాసిన పాట ఆకట్టుకుంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై తన వంతు సేవగా భావించి పాటల రూపంలో సీఎం జగన్‌కు తోడుగా నిలుస్తున్నానని శ్రీనివాస్ తెలిపారు. కవితలు, పాటలు రాయడం హాబీగా ఉన్న శ్రీనివాస్ 'సాక్షి టెలివిజన్'లో రాజోలు డివిజన్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తన పాటలతో ఆకట్టుకుంటున్న శ్రీనివాస్‌ను పలువురు అభినందిస్తున్నారు.